## క్లుప్తంగా

### పర్వతరెడ్డి నివాళి



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 16వ డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకుడు ముదిరెడ్డి లక్ష్మిరెడ్డి తల్లి నారాయణమ్మ మృతి చెందడంతో శనివారం ఆమె భౌతికకాయానికి పడుగుపాడులో వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నివాళులర్పించారు. నారాయణమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

### పెన్నా ఘాట్ పరిశీలన



నెల్లూరు(బృందావనం): వినాయక చవితి ఉత్సవ నిర్వహణ బృందం రంగనాయకులపేట తిక్కన పార్క్ వద్ద ఉన్న పెన్నా ఘాట్‌ను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరాతీశారు. పెన్నాఘాట్ వద్ద జంగిల్ క్లియరెన్స్, నీటి నిలువ సామర్థ్యం పెంపు కోసం ట్యాంక్ బండ్ నిర్మాణం, పెద్ద క్రేన్ల నిర్వహణపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నామన్నారు. ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు పి.సత్యనాగేశ్వరరావు, గౌరవ సలహాదారు పి.సురేందర్‌రెడ్డి, అధ్యక్షులు శ్రీకాంత్, వేలూరు మహేష్, కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఈశ్వరయ్య, హర్షవర్ధన్, సుధీర్, కప్పిర శ్రీనివాసులు, భాస్కర్‌గౌడ్, చంద్రశేఖర్, ఏవీఆర్ మోహన్‌రావు, మదన్‌రెడ్డి, ప్రసాద్, నారా శ్రీనివాసులు, చిత్తలూరు సుందరరామిరెడ్డి ఉన్నారు.

### కమిషనర్‌తో టీడీపీ నేతల సమావేశం

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ నందన్‌ను వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, పలువురు తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు శనివారం కలిశారు. పలు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.

### వామపక్ష నేతల సమావేశం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): బాలాజీనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో వామపక్ష నాయకులు శనివారం సమావేశమయ్యారు. భవిష్యత్తులో స్మార్ట్ విద్యుత్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన పెంపొందించడం, ప్రజలతో కలిసి పోరాటాలు చేయడం లాంటి విధివిధానాలను రూపొందించారు. నేటి నుంచి మూడు రోజుల పాటు జిల్లాలోని అన్ని సబ్ స్టేషన్ల వద్ద నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపట్టి అధికారులకు వినతి పత్రాలు అందజేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, వామపక్ష నేతలు రాంబాబు, కత్తి శ్రీనివాసులు, మాదాల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, కొండా ప్రసాద్ పాల్గొన్నారు.

### బీమా పథకాలను సద్వినియోగం చేసుకోండి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న బీమా పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్బీఐ విజయవాడ జనరల్ మేనేజర్ మహన్ అన్నారు. పట్టణంలోని ఎస్ఎస్ కల్యాణ మండపంలో పొదుపు మహిళలు, ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద వార్షిక ప్రీమియం రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా అందుతుందని వివరించారు. అలాగే ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద వార్షిక ప్రీమియం రూ.436 చెల్లిస్తే రూ.2 లక్షలు బీమా అందుతుందన్నారు. వీటిపై గ్రామ పంచాయతీ స్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వివిధ బ్యాంకుల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### నేత్రదానం



కృష్ణయ్య(ఫైల్)

విడవలూరు: విడవలూరు గ్రామానికి చెందిన నాశిన కృష్ణయ్య (74) శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. కుటుంబ సభ్యుల కోరిక మేరకు ఆయన నేత్రాలను మనసేవా సంస్థ వ్యవస్థాపకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సహకారంతో నెల్లూరు మాడరన్ ఐ హాస్పిటల్‌కు దానం చేశారు. ఐ టెక్నీషియన్లు నాగేశ్వరరావు, సదాశివరామ్‌లు మృతుడి నేత్రాలను సేకరించారు.

# తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ మాధవి

నెల్లూరు(అర్బన్): బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని పెద్దాస్పత్రిలోని ఎంసీహెచ్ విభాగంలో అక్కడికి వచ్చిన ఓపీ మహిళలు, గర్భిణులకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. తల్లిపాల విశిష్టత గురించి ప్లకార్డులు, ఆరోగ్య నినాదాలతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధవి మాట్లాడుతూ తల్లిపాలలో వ్యాధిని తట్టుకునే అనేక పోషకాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గీతాలక్ష్మి, పలువురు గైనకాలజిస్టులు, డాక్టర్లు పాల్గొన్నారు.

⇨ నెల్లూరు(పొగతోట): తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని సీడీపీఓ అరుణ అన్నారు. నగరంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం బాలింతలకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

⇨ నెల్లూరు(వీఆర్సీసెంటర్): జనార్దన్‌రెడ్డి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నమ్మ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు ఇవ్వాలన్నారు. అంతేకాకుండా బిడ్డకు రెండేళ్ల పాటు తల్లిపాలు ఇవ్వడం శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మాధవి, రాధా, అరుణకుమారి, మల్లెమ్మ, ఫాతిమా, స్పందన, శైలజ, విజయశాంతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ అరుణ

⇨ నెల్లూరు సిటీ: మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో తల్లులు పిల్లలకు పాలు ఇచ్చేందుకు ప్రత్యేక గదిని శనివారం ప్రారంభించారు. జిల్లా ప్రజా రవాణాధికారి షమీమ్, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ హేనాసుజన్ పాల్గొని, మాట్లాడారు. ప్రయాణికులకు ఆర్టీసీ బస్టాండ్‌లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీడీపీఓ అరుణకుమార్, డిపో–1 ఇన్‌చార్జి మేనేజర్ చెంచులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జనార్దన్‌రెడ్డికాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో..



ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రత్యేక గదిని ప్రారంభిస్తున్న అధికారులు

# అధిక ఫీజులపై చర్యలకు డిమాండ్



ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

నెల్లూరు (టౌన్): జిల్లాలో విద్యార్థుల నుంచి అధిక ఫీజుల దోపిడీ, అక్రమాలు చేస్తున్న పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హేమంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుమతుల్లేకుండా పాఠశాలలు నిర్వహిస్తున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు ముడుపులు తీసుకుని మిన్నకుంటున్నారని ఆరోపించారు. డీఈఓ పాఠశాలలను సందర్శించడం మానేసి ఏసీ గదికి పరిమితమయ్యారన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మౌనిష్‌రెడ్డి, సుకుమార్, శ్యామ్, మదన్, వైభవ్, సూర్య, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమతుల్లేని నిర్మాణాలను తొలగించండి



అనుమతుల్లేని భవన నిర్మాణ పనులను నిలిపివేయాలని ఆదేశిస్తున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): పట్టణ ప్రణాళికా విభాగం అనుమతుల్లేకుండా నిర్మిస్తున్న భవనాలను పిల్లర్ల దశలోనే గుర్తించి తొలగించాలని కమిషనర్ నందన్ ప్లానింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక 18వ డివిజన్ హరనాథపురం ఎక్స్‌టెన్షన్ ఏరియా తదితర ప్రాంతాల్లో కమిషనర్ శనివారం పర్యటించారు. డివిజన్ పరిధిలో అనుమతుల్లేకుండా నిర్మాణం జరుగుతున్న మూడు అపార్ట్‌మెంట్లను గుర్తించారు. భవన యజమానులను హెచ్చరించి నిర్మాణ పనులను నిలిపివేయించారు. అదేవిధంగా డివిజన్ పరిధిలో అనుమతులను మించి నిర్మాణాలు చేపడుతున్న మూడు భవనాలను గుర్తించి చార్జ్‌షీట్లు దాఖలు పరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్యుపెన్సీ సర్టిఫికెట్లు తీసుకోకుండా భవనాలను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న వారిని గుర్తించి వెంటనే నోటీసులు జారీ చేయాలన్నారు. అనుమతుల్లేని ఫ్లెక్సీలను గుంజలతో సహా తొలగించేయాలని, అనధికార ప్రకటనపై ప్రతిరోజు పర్యవేక్షించాలన్నారు. అనధికార లేఅవుట్లను గుర్తించి యజమానులకు అవగాహన కల్పించి క్రమబద్ధీకరణ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అశోక్ కుమార్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# మూడు మున్సిపల్ దుకాణాల సీజ్

- దాదాపు రూ.10 లక్షలకుపైగా బకాయిలు



సీజ్ చేసిన దుకాణం వద్ద రెవెన్యూ అధికారులు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థకు చెందిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని పలు దుకాణదారులు సంవత్సరాల తరబడి అద్దె చెల్లించని కారణంగా సదరు దుకాణాలను రెవెన్యూ అధికారులు శనివారం సీజ్ చేశారు. నగరంలోని ప్రకాశం పంతులు బిల్డింగ్‌లో ఉన్న మున్సిపల్ దుకాణాల్లో 8, 9, 13 నంబర్ల షాపులకు చెందిన యజమానులు కొన్ని సంవత్సరాలుగా నగరపాలక సంస్థకు అద్దె చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారు. దీనిపై పలుమార్లు ఎన్ఎంసీ అధికారులు నోటీసలు జారీ చేసినా దుకాణదారులు స్పందించలేదు. దీంతో ఎన్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు శనివారం ఆయా దుకాణాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారి కిరణ్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు బిల్డింగ్‌లోని ఎనిమిదో నంబరు షాపు యజమాని (రూ.3,86,109), తొమ్మిదో నంబర్ షాపు యజమాని (రూ.2,49,522), 13వ నంబర్ షాపు యజమాని(రూ.3,72,442) బకాయిలున్నారని, వీరి నుంచి పేరుకుపోయిన మొండి బకాయిలను వసూలు చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు వివరించారు. భవన యజమానులు, అద్దెదారులు సకాలంలో నగరపాలక సంస్థకు అన్ని రకాల పన్నులు, అద్దెలు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు దివ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్వో ప్లాంట్ వితరణ



నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(పెద్దాస్పత్రి)లోని ఎంసీహెచ్ విభాగంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏకే నగర్ శాఖ ఆధ్వర్యంలో వెయ్యి లీటర్ల కెపాసిటీ కలిగిన ఆర్వో ప్లాంటును వితరణ చేశారు. ఆ ప్లాంటును ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా బ్యాంక్ రీజినల్ హెడ్ బండారు శ్యామ్‌ప్రసాద్, డిప్యూటీ రీజినల్ హెడ్ శివశంకర్ భూక్యాలు మాట్లాడుతూ సీఎస్సార్ నిధులతో ప్రసూతి విభాగానికి తాము ఆర్వో ప్లాంటును వితరణగా అందించామన్నారు. అనంతరం వారు ప్రతి పేషెంట్‌కు బ్రెడ్, ఆపిల్, అరటి పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, డిప్యూటీ సూపరింటెండెంట్ మస్తాన్‌బాషా, అడ్మినిస్ట్రేషన్ అధికారి కళారాణి, ఏడీ ఏడుకొండలు, గైనకాలజీ విభాగం హెచ్ఓడీ డాక్టర్ గీతాలక్ష్మి, హెచ్‌డీఎస్ కమిటీ సభ్యుడు దారా మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# సీపీఐ మహాసభల జయప్రదానికి పిలుపు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి అంకయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు జరిగే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య పిలుపునిచ్చారు. సంతపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. నగరంలోని కోటమిట్ట షాదీమంజిల్‌లో నిర్వహించే మహాసభలకు రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రైతు సంఘం జాతీయ కార్యదర్శి రావుల వెంకయ్య, రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. సమావేశంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి సిరాజ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షాన్‌వాజ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్‌కిశోర్ పాల్గొన్నారు.

# క్రీడలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న ద్వారకానాథ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నిత్యం విధి నిర్వహణలో ఉండే జర్నలిస్టులకు క్రీడల ద్వారా మానసికోల్లాసం కలుగుతుందని ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, జేశాప్ జిల్లా గౌరవాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ అన్నారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లూరులో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించేందుకు తమ వంతు సహాయ సహకారాలను అందిస్తామన్నారు. కాగా జేశాప్ జిల్లా గౌరవాధ్యక్షుడిగా ముక్కాల ద్వారకనాథ్, గౌరవ సలహాదారుగా జీటీ మౌంట్‌బాటన్, అధ్యక్షుడిగా ఎస్.నందకిశోర్, ప్రధాన కార్యదర్శిగా జె.సునీల్‌కుమార్, కోశాధికారిగా జనార్దన్, ఉపాధ్యక్షుడిగా వెంకట్రావు, నిర్వాహక కార్యదర్శిగా పరమేశ్వర్, కార్యదర్శిగా ముజ్జు, సంయుక్త కార్యదర్శులుగా మాల్యాద్రి, అభి, సభ్యులుగా ఆరీఫ్, కరిముల్లా, భరత్, హుస్సేన్, మధు, కమల్ ఎంపికయ్యారు. జేశాప్ రాష్ట్ర కార్యదర్శి నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

# వినతులను వేగంగా పరిష్కరించాలి



మాట్లాడుతున్న డీఆర్వో హుస్సేన్ సాహెబ్

నెల్లూరురూరల్: ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించి వారి వినతులను సత్వరమే పరిష్కరించే విధంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలని డీఆర్వో హుస్సేన్ సాహెబ్ అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలోని శంకరన్ హాల్లో కలెక్టరేట్ ఉద్యోగులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ–ఆఫీస్ నిర్వహణపై ఉద్యోగులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కలెక్టరేట్ ఏఓ విజయ్‌కుమార్, ఈడీ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# టీబీ ముక్తభారత్ లక్ష్యం



మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): టీబీ ముక్తభారత్ లక్ష్యంగా ప్రతి ల్యాబ్ టెక్నీషియన్లు పనిచేయాలని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ సూచించారు. నగరంలోని వైద్యశాఖ కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్షా సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 2న ప్రారంభమైన టీబీ ముక్త భారత్ కార్యక్రమం వంద రోజుల వరకు సాగుతుందన్నారు. నాణ్యతతో కూడిన పరీక్షలు చేయడమే కాకుండా ఆలస్యం కాకుండా రిపోర్టులు ఇవ్వాలని కోరారు. జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ రికార్డుల నిర్వహణ, ల్యాబ్ సామగ్రి రక్షణ పక్కాగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సహాయ మలేరియా నివారణాధికారి నాగార్జునరావు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

### పాఠశాలలకు నోటీసులు

నెల్లూరు (టౌన్): కార్పొరేషన్ పరిధిలో ఎలాంటి అనుమతుల్లేకుండా నర్సరీ, ప్లేక్లాసు, ఎల్‌కేజీ, యూకేజీలు నిర్వహిస్తున్న పాఠశాలలకు నెల్లూరు మండల విద్యాశాఖ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు నరహరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3 నుంచి 8 ఏళ్లలోపు పిల్లలకు ఆట ఆధారిత అభ్యసన, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, సురక్షితమైన మౌలిక సదుపాయాలు, తల్లిదండ్రుల ప్రమేయం కల్పించకుండా అందుకు విరుద్ధంగా పలు పాఠశాలలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. పిల్లలకు కనీసం భద్రత కల్పించకుండా పాఠశాలల యాజమాన్యం వ్యవహరిస్తుందన్నారు.

### ఏటీఎం కార్డు మార్చేసి నగదు దోచేసి

నెల్లూరు(క్రైమ్): ఏటీఎం కార్డును మార్చేసి ఖాతాలోని నగదును గుర్తుతెలియని వ్యక్తి దోచేశారు. వివరాల్లోకి వెళ్తే.. వైఎస్సార్ నగర్‌కు చెందిన జ్యోతికి నిప్పో సెంటర్‌లోని ఎస్బీఐ బ్యాంక్‌లో ఖాతా ఉంది. గతనెల 24న ఆమె తన భర్త వెంకటేష్‌తో కలిసి నిప్పోసెంటర్‌లోని ఎస్బీఐ ఏటీఎంలో నగదు డ్రా చేసేందుకు యత్నించారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగుడు నగదు డ్రా చేసి ఇస్తానని వారి ఏటీఎం కార్డును తీసుకుని పిన్ నంబర్ తెలుసుకున్నాడు. అనంతరం నకిలీ ఏటీఎం కార్డును వారికి ఇచ్చి అర్జెంట్ పని ఉందంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొద్దిసేపటికే బ్యాంకు ఖాతా నుంచి రూ.15 వేల నగదు డ్రా అయినట్లు జ్యోతి ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో మోసపోయామని గ్రహించిన ఆమె ఈమేరకు శనివారం వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ‘నక్ష’ సర్వేకు సహకరించండి

నెల్లూరు(బారకాసు): నక్ష (నేషనల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ హాబిటేషన్) పేరుతో ఒక వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ప్రజల స్థిరాస్తులకు ఎంతో ప్రయోజనం చేకూర్చే నక్ష సర్వేకు ప్రజలంతా సహకరించాలని కమిషనర్ నందన్ కోరారు. నక్ష సర్వే శిక్షణ తరగతులను కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శనివారం నిర్వహించారు. నక్ష సర్వేలో దేశవ్యాప్తంగా 157 పట్టణ స్థానిక సంస్థలు (యూఎల్‌బీఎస్)ను పైలెట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేయగా, అందులో ఏపీలోని పది పట్టణాలు ఎంపికయ్యాయని, అందులో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఒకటి కావడం గర్వకారణమన్నారు. ఈ సర్వే ద్వారా పౌరులకు ఆస్తి హద్దులపై స్పష్టత, ఆస్తి వివాదాలు నివారించడానికి ఉపయుక్తంగా ఉంటుందని వివరించారు. నెల్లూరు పారదర్శకంగా, అభివృద్ధితో కూడిన డిజిటల్ నగరంగా మారేందుకు ప్రతి ఒక్కరూ కలసికట్టుగా ముందడుగు వేయాలని ఆకాంక్షించారు.

⇨ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ సంపత్‌కుమార్‌లు వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఎన్ఎంసీ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి కమిషనర్ నందన్, అన్ని విభాగాల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. టిడ్కో గృహాల నిర్మాణం, నూతన లబ్ధిదారులకు గృహాల కేటాయింపు, అన్న క్యాంటీన్ల నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, ఆస్తి పన్నుల వసూళ్లు, భవన నిర్మాణాల అనుమతులు, సర్వీస్ లెవెల్ ఇండికేటర్స్, స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర, రెడ్యూస్, రీ యూజ్– రీ సైకిల్ విధానం, కాలువల పూడికతీత, పచ్చదనం పెంపు, పార్కుల ఏర్పాటు తదితర అంశాలపై నెల్లూరు నగరపాలక సంస్థ ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి, టిడ్కో, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### వీఆర్ మున్సిపల్ పాఠశాల సందర్శన



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని వీఆర్ మున్సిపల్ స్కూల్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం సందర్శించారు. పాఠశాలలో టీచింగ్ సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోజనం వడ్డించే సిబ్బందితో మాట్లాడి ఆహార నాణ్యతపై ఆరాతీశారు. ఆయన వెంట పాఠశాల సిబ్బంది ఉన్నారు.

### బైక్ చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఇంటి ముందు నిలిపిన బైక్ చోరీకి గురైన ఘటనపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. తిప్పరాజువారి వీధిలో ఆర్.రమేష్‌బాబు నివాసం ఉంటున్నారు. ఆయనకు పల్సర్‌బైక్ ఉంది. గత నెల 18వ తేదీ రాత్రి ఆయన తన బైక్‌ను ఇంటి ముందు పార్కింగ్ చేశారు. ఈ క్రమంలో బైక్‌ను గుర్తుతెలియని దుండగులు అపహరించుకుని వెళ్లారు. ఈ మేరకు బాధితుడు శనివారం చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### కోనేరు రంగారావు కమిటీపై 12న సదస్సు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సుల్లో ‘ఇళ్ల స్థలాలు– భూ సమస్యలు’ అనే అంశంపై వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 12న నగరంలోని టౌన్‌హాల్లో జిల్లాస్థాయి సదస్సును నిర్వహిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య పిలుపునిచ్చారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలు శనివారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, పేదలకు ఇళ్లు, రైతులకు రెండెకరాల భూమి కల్పించేలా ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లీలామోహన్, నందిపోగు రమణయ్య, సీపీఐ సహాయ కార్యదర్శి సిరాజ్, కార్యవర్గ సభ్యులు షాన్‌వాజ్, మధు తదితరులు పాల్గొన్నారు.

### డిపో–1 ఇన్‌చార్జి డీఎంగా సునీత

నెల్లూరు సిటీ: నెల్లూరు ఆర్టీసీ డిపో–1 ఇన్‌చార్జి డీఎంగా ఎం.సునీతను నియమించారు. ఇటీవల డీఎం–1గా విధులు నిర్వహిస్తున్న మురళీకృష్ణ పదవీ విరమణ పొందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన స్థానంలో డిపో సీఐగా చేస్తున్న సునీతను నియమించారు.